మహిళా పార్క్ ప్రారంభోత్సవానికి మహిళలు భారీగా తరలిరావాలి : మేయర్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: నగరంలో సోమవారం మహిళా పార్క్ ప్రారంభోత్సవానికి మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ఆదివారం మహిళా పార్కు ప్రాంతంలో మహిళా కార్పొరేటర్లతో కలియతిరిగారు. మహిళా పార్కులో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, పిల్లల క్రీడా సామాగ్రి వంటి అంశాలను పరిశీలించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా మహిళలకు ఇస్తున్న గౌరవం మరువలేనిదన్నారు. అదే రీతిలో స్థానిక శాసనసభ్యులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మరో అడుగు ముందుకు వేసి మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేసి ప్రారంభించడం గొప్ప విశేషమన్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియం నుండి 5వేలకు పైగా మహిళలతో ర్యాలీ చేపట్టి ప్రారంభోత్సవ ప్రాంతానికి చేరుకోనున్నట్లు చెప్పారు. మహిళలందరూ ఆనందగజపతి ఆడిటోరియంకి చేరుకొని ర్యాలీలో పాల్గొనున్న మంత్రులు బొత్స సత్య నారాయణ, ఆర్కే రోజా, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులతో కలిసి పాల్గోవాలని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కును మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యతరగతి మహిళలకు కూడా ఉపయుక్తంగా ఉండే విధంగా స్విమ్మింగ్ పూల్ తదితర అంశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, మహిళా కార్పొరేటర్లు, పైడితల్లమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు, వివిధ డివిజన్ల మహిళా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ఇతర మత్తు పదార్దాల ఆచూకీ కై విస్తృత గాలింపు చర్యలు

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ జై భీమ్

విశాలాంధ్ర-బొబ్బిలి: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయ పరిధిలో గంజాయి ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా కాకుండా నివారణకై గత కొంతకాలంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ జై భీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపడుతున్న విషయం పాఠకులకు విధేయతమే. అందులో భాగంగానే ఆదివారంస్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, సీఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో పలు అనుమానిత ప్రదేశాలలో నిర్మానుష్య ప్రాంతాలలో తనిఖీ లు విస్తృతంగా చేపట్టారు.

కృష్ణాపురం రోడ్డు, కోటిచెరువు గట్టు, క్రీడా ప్రాంగణం దరి తోటలు, ఇందిరమ్మ కోలనీ తదితర ప్రదేశాలను ఎవరూ గంజాయి ఇతర డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్థాల ను వాడ కాన్ని నిరోదించేందుకు ప్రతీ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిం చారు. మానవ జీవితాలతో చెలగాటంఆడుతూ అనారోగ్య పాలు చేస్తున్న గంజాయి ఇతర మత్తు పదార్థాలు జోలికి నేటి యువతీ యువకులు దూరంగా ఉండాలని కోరారు. యువత యువకులంతా విద్య ప్రత్యేక దృష్టిసారించి వివిధ పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు సాధనకు కృషి చేయాలని కోరారు.

నిరుపేదలకు నిత్యవసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర-జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హేండ్స్ సేవాసంస్థ ఆద్వర్యంలో నిరుపేదలకు నిత్య వసర వస్తువులను పంపిణీ చేసారు. గ్రామంలోని పలువురు ఉద్యోగులు అంతా కలిసి హెల్పింగ్ హేండ్స్ సంస్థను స్థాపించి గ్రామంతోపాటు పక్కనే ఉన్న తానవరం గ్రామానికి చెందిన ప్రజలకు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు మగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అంద జేసారు. అలాగే ప్రతీ నెలా గ్రామంలో 20మంది నిరుపేదలకు నిత్యవసర వస్తు వులను పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం హెల్పింగ్ హేండ్స్ సభ్యులంతా కలిసి నిత్యవసర వస్తువులను పంపిణీచేసి భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులతోపాటు గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.

పది విద్యార్థులు రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో పదోతరగతి విద్యార్థులు రీ-వెరి ఫికేషన్ పెట్టిలి అనుకున్నట్లు అయితే అప్లికేషన్, సీ.ఎఫ్.ఎమ్.ఎస్. చలానా (ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.1000/- చొప్పున), హాల్ టికెట్ జెరాక్స్, ఆన్లైన్ లో తీసిన మార్కు లిస్టు జెరాక్స్, స్టూడెంట్ ఇంటి అడ్రస్ తో బుక్ సైజు (ఎ4 సైజు క్లాత్ కవర్), స్కూలో అడ్రస్‌తో 10ఇంటూ4 సైజు కవర్ (పోస్ట్ స్టాంప్ లు అంతికించ అవసరం లేదు), అప్లికేషన్ పై ఫోటో మీద మరియు అప్లికేషన్ దిగువున సంబందిత స్కుల్ హెడ్ మాస్టర్ సంతకం చేసి స్టాంప్ వేసి ఈ అప్లికేషన్ సెట్‌ను స్ట్రాంగ్ రూమ్, కోట, విజయ నగరంలో తేది13-05-2023 సాయంత్రం 5 గంట లలోపు అందజేయాలి. అనీలేని ఎడల ఎట్టి పరిస్థితు ల్లో అప్లికేషన్ అనుమతించబడవు అనీ ఎమ్ఈఓ జే.తిర్నాధరావు తెలిపారు.

విద్యుత్ షాక్ కు లైన్‌మేన్ మృతి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం బూరాడపేట సచివాలయం లైన్‌మేన్ మద్దిల శివ విద్యుత్ షాక్ కి గురై శుక్రవారం మృతిచెందారు. లైన్‌మేన్ శివ బూరాడపేట జంక్షన్ వద్ద ఎల్‌సి తీసుకుని విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తున్నారు. రెండు జంపర్లు కట్ చేశారు. మరో జంపర్ నుంచి రిటన్ విద్యుత్ సరఫరారావడంతో విద్యుత్‌షాక్‌కి గురయ్యారు. స్థానికులు గమనించి విద్యుత్ స్తంభంపై నుంచి శివని కిందకి దించి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడిది నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందినవారు. శివ మృతిచెందడంతో జరజాపుపేటలో విషాధచాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం.. ఆదర్శప్రాయం

- ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల
- మన్యవీరుని ఆశయ సాధనకు కృషి: జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : భరతమాతను దాస్య శృంఖలాల నుంచి విముక్తం చేసేందుకు.. మన్యంలో పోరాట వీరులను తీర్చిదిద్ది తెల్లవారిని గడగడలాడించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఏపీ శాసనసభ ఉవసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను అర్పిం చిన అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయమని తెలిపారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని అల్లూరి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని దాసన్నపేట రైతు బజార్ కూడలి(అల్లూరి సీతారామరాజు జంక్షన్) వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తో కలిసి ముఖ్యఅతిథిగా కోలగట్ల హాజరయ్యారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్ర దానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 99 ఏళ్లు గడిచినా సీతారామరాజు ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నారని చెప్పారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో స్ఫూర్తిని కలిగించిన గొప్ప నాయకుడు అని ప్రశంసించారు. ఇటువంటి మహనీయుల వర్ధంతి, జయంతి సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ఈ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ఆ పోరాట యోధుని స్ఫూర్తిని చిరస్థాయిగా ఉంచేందుకే తమ హయాంలో దాసన్నపేట వద్ద విగ్రహం నెలకొల్పడంతో పాటు, అల్లూరి సీతారా మరాజు కూడలిగా నామకరణం చేశామని గుర్తు చేశారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం ద్వారా వారి ఆశయాలను భావితరాలకు అందించగలుగుతామని చెప్పారు. పోరాట యోధులకు ఉత్తరాంధ్ర పెట్టింది పేరని ఇటీవల భోగాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా అన్నారని గుర్తు చేశారు. మన్యం వీరునికి ఈ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేకంగా ఒక ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేసినట్లు తెలిపారు. సీతారామరాజు ఆశయ సాధన కోసం ప్రజాప్రతినిధులమంతా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, కార్పొరేటర్లు గాదం మురళి, ఆల్తి సత్య కుమారి, అల్లూరి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

విప్లవవీరుడు అల్లూరి కి ఘన నివాళులు

నివాళులర్పించిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట : విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి వేడుకలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు చిత్రపటం వద్ద పూలు వేసి ఎమ్మెల్సీ రఘురాజు, పలువురు నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బ్రిటీష్ వారి గుండెల్లో దడపుట్టించిన గొప్పవ్యక్తి, దేశం కోసం తుపాకీ తూటాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన మహనీయులు శ్రీఅల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు పేరిట రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాకు పేరు పెట్టి ఆయన కీర్తిని ప్రపంచం ఉన్నంత వరకు ఉండేలా చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, ఎం.పి.టి.సి మజ్జి దేవి, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, నాయకులు మోపాడ శ్రీను, రమణ, గంగరాజు, సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాజులరేగలో ఇదేం ఖర్మ ...

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: టిడిపి నాయకులు పూసపాటి అశోక్ గజపతి రాజు, అతిథిగజపతి రాజుల ఆదేశాలమేరకు ఆదివారం గాజులరేగలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్య క్రమం నిర్వహించడం జరిగింది. 49వ డివిజన్ కార్పొరేటర్ కర్రోతు రాధామని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల వరప్రసాదు, నగర మాజీ అధ్యక్షులు కర్రోతు నర్సింగరావు, క్లస్టర్ ఇంచార్జ్ కోరాడ వెంకట రావు, సీనియర్ నాయకులు గడి శ్రీను, ఆల్తి బంగారుబాబు, సైలాడ శంకర్రావు, గెద్ద శ్రీను, లెంక రమణ, సియ్యాదుల సంతోష్, పట్టణ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు దుక్కపైడిరాజు, బూడి రమేష్, కొయ్యాన శ్రీను, మన్యాల మహేష్, దాన గురుమూర్తి, కోరాడ ఆదినారాయణ, సారికి శ్రీను, ముద్దాడ రామకృష్ణ, కొండ్రు అప్పలరాజు, మజ్జి కుమార్, అప్పరబోతు శ్రీను, ఓళ్ళ అప్పలరాజు,ఆకుల రామకృష్ణ, ఓళ్ళ గోవింద, మహంతి రవి, కాళ్ళ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాలలో 6వ ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరమునకు గాను ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి సీట్లు భర్తీ చేయాలని కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ జారీ చేశారని ఇందులో భాగంగా బక్కు నాయుడు పేటలో గల ఆదర్శ పాఠశాలల్లో 6 వ తరగతి సీట్లు భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ దరఖాస్తులను ఆన్లైన్ విధానం ద్వారా %ఃఃఃఎంవ.ఖజూ. స్త్రశీజ. అఅథుజూఎం.ఖజూ. స్త్రశీజ. అఅ% వెబ్ సైట్ ద్వారా ఈ నెల 10-5-2023 నుండి25-5-2023 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు.ఈ పాఠశాలలో ప్రవేశానికి ఓసి బిసి విద్యార్థులు 01-09-2011 నుండి 31-08-2013 మధ్య జన్మించి ఉండాలని అలాగే ఎస్సీ, ఎస్టి విద్యార్థులు 01-09-2009 నుండి 31-08-2013 మధ్య జన్మించిన వారై ఉండాలని అలాగే ఇదే జిల్లాలో ప్రభుత్వం లేదా ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 2021-22 మరియు 2022-23 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొందాలన్నారు. అలాగే ప్రవేశానికి పరీక్ష రుసుం ఓసి బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.75లు నెట్ బ్యాంకు క్రెడిట్ కార్డు డెబిట్ కార్డు ద్వారా చెల్లించాలని, అలాగే11-06-2023న 10 గంటల నుండి 12 గంటల వరకు బక్కు నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాలల్లో పరీక్ష నిర్వహించబడునని ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగునని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

వైఎస్ జగన్ ను ఎందుకు నమ్మాలి ?

లోకం ప్రసాద్

విశాలాంధ్ర-భోగాపురం: వైఎస్ జగన్ ను ఎందుకు నమ్మాలని జనసేన నాయకుడు మిరకిల్ సంస్థల అధినేత లోకం ప్రసాద్ ప్రశ్నించారు. భోగాపురం జాతీయ రహదారి పక్కన ఆదివారం లోకం ప్రసాద్ నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అనంతరం జగిరిన సభలో అయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా నెలకు రూ. 5వేలు ఇచ్చి వారితో సంఘ సేవచేయిస్తున్నారని, అలాగే ఉచిత పథకాలు ఇస్తున్నామని చెప్పి అధిక ధరలతో మళ్ళీ ప్రజలనుండి ఇచ్చిన పథకాలు కన్నా ఎక్కువ పిండేస్తు న్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు కందివలస గెడ్డలో ప్రవహిస్తున్న కెమికల్ కంపినీల వ్యర్థాలు కనించలేదా? అలాగే పూసపాటిరేగ మండలంలో చాల గ్రామాల్లో భూగర్భ జలాలు కెమికల్ కంపినీలు వల్ల కలుషితమయ్యాయని వాటి గురించి పట్టిం చుకోరా? నాలుగు సంవత్సరాలు క్రితం చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ఇప్పటివరకు విమానాశ్రనిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ జిల్లా నుంచే విద్యార్థులు ఎంసెట్ పరీక్ష వ్రాయడానికి విజయవాడ వెళ్లాల్సిరావడం బాధాకరమన్నారు. ఇలా చెప్పుకొంటూపోతే వేల సమస్య లున్నాయని మరి మనం వైఎస్ జగన్ ఎందుకు నమ్మా లన్నారు. ఆర్థికంగా చితికిపోయిన వేల మంది కౌలు రైతులకు 5 లక్షలు చొప్పున సహాయం అందించడమే కాకుండా తాను సంపాదించిన ప్రతీ పైసా పవన్ కళ్యాణ్ పేదలకు వెచ్చిస్తున్నారన్నారు. జనసేన అధికారంలోకి వచ్చేందుకు వచ్చే ఎన్నికల్లో అందరం గాజుగ్లాస్ కు ఓటేసి మంచి మనసున్నపవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయా లన్నారు. అనంతరం శంకుస్థాపనకు హాజరైన సుమారు 2000 మంది మహిళలకు చీరలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, చక్రవర్తి, రవితేజ, ఖాన్ భోగాపురం మండల అధ్యక్షులు వందనాల రమణ, నియోజకవర్గ సీనియర్ నాయకులు పల్ల రాంబాబు, పల్లంట్ల జగదీష్ జోగారావు, పైల శంకర్, గోవిందు, సతీష్, రాంచంద్ర, వీర మహిళలు అట్టాడ ప్రమీల బాసి దుర్గ, హైమ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు. ..

శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు

విశాలాంధ్ర-సీతం పేట: సీతంపేట స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిబిరాలలలో చదువు మరియు క్రీడలు ఇతర విజ్ఞాన పరమైన పరిజ్ఞానం కల్పించేందుకు 40 రోజుల పాటు ప్రభుత్వం శిబిరాలను కొనసాగునున్నాయి అని శాఖ గ్రంథాలయ అధికారి గణేష్ మాస్టర్ తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పుస్తకపఠనం, చిత్ర లేఖనం, మట్టితో బొమ్మలు తయారు చేయడం,పేపర్ క్రాఫ్ట్, అల్లికలు ఎలా తయారుచేయాలో నేర్పడం జరుగుతుంది. ఎవరైనా విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వక్తలు, పట్టభద్రులైన యువత, పురస్కార గ్రహీతలు, సాహితీవేత్తలు ,వారికి వీలుంటే ఉదయం పిల్లలకు విజ్ఞానం, మెలుకువలు అందించమని కోరుతున్నామని తెలిపారు.

స్పీకర్ ను మర్యాద పూర్వకంగా కలసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ను స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్పీకర్ కుటుంబంతో పాటు రాయగడ అమ్మవారి దర్శనానికి వెళుతున్న సందర్భంగా కొత్తవలస ప్రధాన రహదారి ముఖద్వారం వద్ద నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు అందరితో కలిసి ఘనంగా స్వాగతం పలికి గజ మాల వేసి దుస్సాలువాలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-రేగిడి : వంగర మండలం అరసాడ గ్రామం పరిధిలోగల అరసాడ -కొండవలస జంక్షన్లో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో కందిష మాధురికి తీవ్ర గాయాలవ్వగా ఆమె తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. వీరుని 108 ఈఎంటి రాజారావు, పైలెట్ పవన్ కుమార్లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి రాజాం ఆసుపత్రికి తరలించారు.

పండుగ సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు

సీతానగరం-అజ్జాడ రూటుకు వాహన రాకపోకలు మళ్లింపు

పోలీస్ సిబ్బందికి భక్తజనం సహకరించండి : ఎస్ఐ కె నీలకంఠం

విశాలాంధ్ర-సీతానగరం: నేటినుండి సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, అప్పయ్యపేట, జోగమ్మపేట గ్రామాల్లో భోగితల్లి పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు పట్టణ సిఐ కృష్ణారావు పర్యవేక్షణలో ప్రత్యేకబందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సబ్ ఇన్స్పెక్టర్ కె. నీలకంఠం తెలిపారు. పండుగను పురస్కరించుకుని ఆయన విలేఖరులతో మాట్లాడారు.సోమవారం ఘటాల ఊరేగింపు, మంగళవారం సిరిమానోత్సవం,బుదవారం ముగింపు ఉత్సవం ఉంటుందన్నారు, సిరిమాను తిరిగే ప్రాంతాల్లో, వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే స్థలాల్లో పోలీస్ సిబ్బంది ఉండి పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. సిరిమాను తిరిగే సమయంలో భక్తులరద్దీ దృష్ట్యా పోలీసులకు భక్తులు, స్థానికులు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. కమిటీ సభ్యులు వివరించిన మేరకు వాహనాలు పార్కింగ్ చేయాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ సిబ్బందికి సహకరించి సజావుగా పండుగ జరిగేలా చూడాలని కోరారు. పండుగకు వచ్చే భక్తులు విలువైన బంగారు ఆభరణాలు ధరించి, డబ్బులతో సిరిమాను తిరిగే సమయంలో, ప్రోగ్రాంలు జరిగే ప్రాంతాల్లో తిరగవద్దని కోరారు. విద్యుత్ వైర్లు ఉండే దిగువున ఉండవద్దని సూచించారు.సిరిమాను తిరిగే సమయంలో పాడుబడిన మేడలు, మిద్దెలు, గోడలు ఎక్కివీక్షించవద్దని సూచించారు. సిరిమాను సంబరం జరిగే మంగళవారం పోలీస్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు మళ్లింపుకుసహకరించాలని కోరారు. సీతానగరం-అజ్జాడ రూటు వాహనాలను మరిపివలస మీదుగా మళ్ళించడం జరుగుతుందని, దీనికి వాహనదారులు,ప్రయాణికులు సహకారాన్ని అందించాలని కోరారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. 12ఏళ్ల తరువాత నిర్వహించనున్న పండుగను పురస్కరించుకుని ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, పోలీసులకు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. ఐదు గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే సిఐ సెల్ ఫోన్ 9121109467, ఎస్ ఐ 9121109457 కు సంప్రదించాలన్నారు. ఇప్పటికే ఒక్కసారి ఈఐదుగ్రామాల్లో మైకుద్వారా కూడా ప్రచారాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతీఒక్కరూ పండుగను సజావుగా జరిగేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పదిలో ప్రతిభ కనబర్చిన కోనూరుకు ఏపి టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ అభినందనలు

విశాలాంధ్ర-బెలగాం : ఏపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తన పర్యటనలో భాగంగా ఆదివారం పార్వతీపురం మునిసిపాలిటీ జగన్నాధపురం నివాసి కోసూరు రామానుజాచారి కుమారుడు కోసూరు ప్రసన్నకుమార్ ఇటీవల విడుదలచేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో విజయనగరం జిల్లా స్థాయిలో (583/600 మార్కులు) ద్వితీయ స్థానం సాధించినందుకుగాను వారి తల్లితండ్రులను, చిరంజీవి కోసూరు ప్రసన్న కుమార్ ని స్వీట్స్ తినిపిస్తూ ఆత్మీయంగా అభినందిస్తూ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జమ్మాన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంతటి విజయం సాధించడం అభినందనీయమని, మరిన్ని విజయాలు సాధించి పార్వతీపురం మన్యం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థి తండ్రి తనకు మంచి మిత్రుడని తెలుపుతూ భవిష్యత్తులో విద్యార్థి చదువు నిమిత్తం కావాల్సిన సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అదే విధంగా కార్పోరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా అందరికీ అందేదిగా ఉండేటట్లు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని, అంతే కాకుండా విద్యారంగంలో అరుదైన మార్పులు తెస్తూ విభిన్న సంక్షేమ పథకాలను కూడా అమలు చేసి విద్య అనేది పేదలకు అందుబాటులో ఉండేదిగా చేసి ప్రపంచం నలుమూలలా ఎక్కడైనా విద్యను అభ్యసించే విధంగా వినూత్న రీతిలో ఆలోచనలుచేసి దేశం మొత్తం ఆంధ్రరాష్ట్రం వైపు చూసి గర్వించేలా చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, సర్పంచ్ బోను రామినాయుడు పార్టీ ముఖ్య నేతలు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పైపులైన్ పై పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సీతంపేట: సీతంపేట మండలం కంబ గూడ గ్రామంలో నివాసం ఉంటున్న మొగల్ దాదాసాహెబ్(58) శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మెయిన్‌రోడ్ వద్ద ఆస్పత్రి ఎదురుగా వాటర్ పైప్‌లైన్ పై కాలుజారి తలకు తీవ్రమైన గాయం అవ్వడంతో మృతి చెందారని సంఘటనపై మృతుడి భార్య మొగల్ నిన్నభి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని సబ్ ఇన్స్పెక్టర్ నీలకంఠారావు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి పంపించడం జరిగిందని తెలిపారు.

యువత అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నేటి యువత మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం మండలంలోని బాలగుడబ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు గేరిల్లా పోరాటం ద్వారా వెనుకబడిన వర్గాల గిరిజనులను బ్రిటిష్ వారి కబంధహస్తాల నుండి విముక్తి కల్పించిన ఘనత అల్లూరి సీతారామరాజు కే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్య సాధనకు అల్లూరి సీతారామరాజు ఏ రకంగా సాంప్రదాయ పద్ధతిలో బ్రిటిష్ వారిని గడగడలాడించే విధంగా పోరాటం చేశారో అందరికీ తెలిసిన విషయమే అన్నారు. ఆ మహనీయుడి ఆలోచన ధోరణిని, పోరాట ప్రతిభను యువత ఆదర్శంగా తీసుకుని మన బాలగుడబ గ్రామంలో విగ్రహం ఏర్పాటు అభినందనీయమని అలానే తన చేతులమీదుగా ప్రారంభం చేసుకోవడం చాలా శాంతిసదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందు, మాజీ సర్పంచ్ మువ్వల సత్యం నాయుడు, ఎంపీటీసీ వి నీలవేణి, వైస్ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

కొమరాడ: ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి అల్లూరి విగ్రహం ఆవిష్కరణ చేసిన మాజీమంత్రి విజయరామరాజు ఆదివారం కొమరాడ కాలేజీ వద్ద అల్లూరు సీతారామరాజు 99 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామరాజు కురుపాం నియోజవర్గ టీడీపీ ఇన్చార్జి తోయిక జగదీశ్వరి చే కొమరాడ కాలేజీ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించి ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గిరిజనుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఆయన త్యాగాలు మరవలేనివని ఆయన అన్నారు అలాగే తోయుకు జగదీశ్వరి మాట్లాడుతూ ఆదివారం అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి జరపడం అందులో భాగంగా విగ్ర ఆవిష్కరణ చేయడం చాలా సంతోషకరమైన విషయం అనే ఈ అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయటానికి కుచ్చేసిన కొమరాడ గ్రామానికి చెందిన బత్తిలి శీనుకి అభినందన అభినందకరం అని బత్తిలి శీను తెలుగుదేశం పార్టీ కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కొమరాడ కాలేజీ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేయటం కాలేజ్ దగ్గర చదువుతున్న విద్యార్థులు విద్యార్థులు మన్యం వీరుడు త్యాగాలు గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం చాలా ఉందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ గులిపిల్లి సుదర్శన్ రావు సీనియర్ నాయకులు నంగిరెడ్డి మధుసూదన్ రావు, పొట్నూరు వెంకట నాయుడు మాజీ ఎంపిటిసిలు గొట్టాపు తిరునాధ బురిడీ వేణు సిపిఎం నాయకులు కొల్లు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలుప్పి గ్రామంలో ఇదేంఖర్మ-మన రాష్ట్రానికి ... కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో గెడ్డలుప్పి గ్రామ పంచాయతీలో ఆదివారం సాయంత్రం ఇదేంఖర్మ-మన రాష్ట్రానికి కార్యక్రమంను టీడీపీనియోజక వర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నర ఏళ్లలో వైఎస్సార్సీపీ అన్నివిధాలుగా వైపల్యం చెందిందని తెలిపారు.నిరుద్యోగం, ఆడబిడ్డలకు భద్రత ఏది, బాదుడే బాదుడు, మద్యాంధ్ర ప్రదేశ్, ఊసేలేని అభివృద్ధి, కానరానిరోడ్లు, ఇసుక ఇక్కట్లు, ఏపీరాజదాని ఏది?, అనకొండలా అవినీతి, షాక్ కొట్టించే కరెంటు ధరలు, గిట్టనిగిట్టుబాటుధరలు తదితర అంశాలపై ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వైఎస్సారసీపీ దుర్మార్గ పాలనలో మహిళలకూ భద్రత లేదని, యువతకు ఉపాధి లేదని, రైతులకు భరోసా లేదని, రాష్ట్రానికి రాజదాని లేదని నినాదాలు చేశారు. ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిధులులేక నిలిచిపోయానని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ప్రధానకార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు,గొట్టాపు వెంకటనాయుడు, బోను దేవీచంద్రమౌళి, శంకరరావు, వెంకటనాయుడు, తిరుపతి రెడ్డి సింహాచలం, సోమిరెడ్డి రమేష్, శ్రీరాములు నాయుడు, నడిమింటి ధనంజయ, సాదాపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక సామాజిక అభివృద్ధిపై రైతులతో చర్చ

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా టీకలోవలో కార్బన్ క్రెడిట్ పై భాగస్వామ్యమైన రైతులు స్మార్ట్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో జి.కే.ఎఫ్ అధినేత ఎస్కే యం పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఎవరైనా రైతులు నమోదుకాకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమం విధివిధానాలు రైతుల లాభ నష్టాల పై ఆయన ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణ చేసి భూగోళాన్ని భద్రంగా ఉంచాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమం తాలూకా విధి విధానాలను రైతుల ఆర్థిక సామాజిక అభివృద్ధిపై రైతులతో చర్చించారు. తర్వాత రైతులు జిల్లా అంతట ఈ కార్యక్రమాన్ని విస్తరింప చేయాలని ఆయన అన్నారు. 2023 పూర్తి అయ్యేనాటికి 1500 మంది రైతులు భాగస్వామ్యమే పనిగా పని చేస్తామని స్మార్ట్ సంస్థ సిబ్బంది హామీ ఇచ్చారు.

ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ సందర్శన

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్లలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ని నాబార్డు డిడిఎం టి నాగార్జున శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ లో తయారైన విత్తనాలు, ఎరువులు ప్రక్రియను పరిశీలిం చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు, వ్యవసాయ అధికారులు పి లక్ష్మి, ఎం పూర్ణిమ, ఎఇఓ దామోదర్ పాల్గొన్నారు.

శ్రీ రామ మందిర ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి





విశాలాంధ్ర-తెర్లాం: బాడంగి మండలం రేజెరు గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిర ప్రతిష్ట మహోత్సవాలు గత మూడురోజులుగా ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్,ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై శ్రీ సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొని శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగిని సర్పంచ్,గ్రామ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ బొమ్మినాయుని వెంకట నాయుడు,వైస్ ఎంపీపీ రమేష్,జేసిఎస్ కన్వీనర్లు తమ్మిరెడ్డి దామోదర్, మరిపి శంకరరావు,వైసీపీ నాయకులు తెంటు మధు,భాస్కరరావు,అడ్వకేట్ రుంకన ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులు సందర్భంగా ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా శాఖ గ్రంథాలయ నిర్వాహకులు ఆరిక.ధర్మారావు తెలిపారు. ఈ వేసవి శిబిరంలో కథలు వినుట పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్రలేఖనం పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, మొదలగు సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు నిర్వహించబడతాయని కావున విద్యార్థులు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

వాహన తనికీల్లో పట్టుబడ్డ 60 కేజీల గంజాయి

మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు, కారు స్వాధీనం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మండలం, బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద తహ శీల్దార్ డి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది సోమరాజు, నాయుడు తో కలిసి ఎస్.ఐ జె.తారకేశ్వరరావు, హెచ్సీలు రామకృష్ణ, ప్రసాద్, పోలీసులు వాహనాల తనికీ చేస్తుండగా కారులో తరలిస్తున్న 60 కేజీల గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ కారులో గంజాయి తరలి స్తున్న మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాకు చెందిన ఫరూక్ ఇస్మాయిల్ అత్తర్, దాలే అరుణ్ రామ్ రావు అనే ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని, అయితే వీరు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన శ్యామ్ అనే వ్యక్తి వద్ద ఈ 60 కేజీల గంజాయి కొనుగోలు చేసారని, శ్యామ్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. కారుని స్వాధీనం చేసుకుని, పట్టుబడ్డ మహారాష్ట్రకు చెందిన ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్.ఐ తారకేశ్వరరావు వివరించారు.

10న టెక్ బి సెలక్షన్ డ్రైవ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నైపుణ్యాభివృద్ధి సంస్థ & హెచ్ సీ ఎల్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో టెక్ బీ ప్రోగ్రాంకు సెలక్షన్ డ్రైవ్ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి యు.సాయి కుమార్ & డివిఈఓ మంజుల వీణ తెలిపారు.ఇంటర్మీడియట్ 2021-22లో 60 శాతం, 2022-2023లో 75 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈ యొక్క డ్రైవ్ కి అర్హులన్నారు.ఈనెల 10వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుండి పార్వతీపురం శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ నందు ఆన్ లైన్ లో పరీక్షా ఉంటుందన్నారు. ఈ డ్రైవ్ కు హెచ్.సి.ఎల్ టెక్నాలజీ ప్రతినిధులు హాజరయ్యి అర్హత కలిగిన వారిని కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9182398325 నంబరును సంప్రదించాలని తెలిపారు.

పదో తరగతి పరీక్షా ఫలితాలలో గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-బొబ్బిలి : నియోజకవర్గ పరిధి రామభద్రపురం లో ఉన్న గ్లోబల్ వ్యూ స్కూల్ లో 26 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా శత శాతం ఉత్తీర్ణత సాధించారు. 600 మార్కులకు 585 మార్కులు చీకటి రిషిత్ సాధించగా, ఈశ్వర చైతన్య బాలి 581 మార్కులు సాధించగా, ఉత్తరా విల్లి సాయి లిఖిత్ 5 75 మార్కులు సాధించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ కరస్పాండెంట్ పోల వెంకట చంద్రమోహన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పదవతరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధనలో కృషిచేసిన ఉపాధ్యాయ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తమ స్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన సి బి ఎస్ ఈ కోర్సు తో బొబ్బిలి డివిజన్ పరిధిలో ఏ స్కూలుకు లేనివిధంగా విశాలమైన క్రీడా ప్రాంగణ్యం లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన ఆరోగ్యానికి అవసరమైన క్రీడలను ఆడిస్తూ వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కూడా స్కూల్ కాలేజీలో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పార్వతీపురం మన్యంజిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యూనియన్ ఏర్పాటు

విశాలాంధ్ర-పార్వతీ పురం: పార్వతిపురం మన్యంజిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యూనియన్ఏపిపి హెచ్ సి డి ఏ ప్రెసిడెంట్ డాక్టర్ రఘుకుమార్, ఏపీ ఎన్జీవో అధ్యక్షులు కిషోర్, ఏపిపి హెచ్‌సిడిఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మంతిని వినోద్ అధ్యక్షతన పార్వతీపురం ప్యానల్ మెంబర్స్ ని ఎన్నుకోవడం జరిగింది. సీహెచ్ జగదీష్ ని ప్రెసిడెంట్, రామకృష్ణ జనరల్ సెక్రెటరీగా, ప్రశాంత్, సరిత వైస్ ప్రెసిడెంటులుగా, రాజేశ్వరి, జాకబ్ ట్రెజరర్ గా ఇతరులను ప్యానెల్ మెంబర్స్‌గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈసంధర్భంగా జిల్లా ప్రెసిడెంట్ డాక్టరు రఘు మాట్లాడుతూ మన్యంజిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యూనియన్ అభివృద్ధి కొరకు తనసహకారం అన్ని విధాలుగా అందిస్తామన్నారు. కొత్తగా ఏర్పడిన కమిటీకీ అభినందనలు తెలిపారు. ఏపీ ఎన్జీవో ప్రెసిడెంట్ కిశోర్ మాట్లాడుతూ ఇదిచాలా శుభపరిణామని, ముఖ్యంగా మనజిల్లాలో ఉన్నా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేసుకుపోవడంలో కృషి చేస్తానని చెప్పారు.డాక్టరు మంతిని వినోద్ కుమార్ మాట్లాడుతూ సిహెచ్ఓలు పనిచేస్తున్న తీరు బావుందని, మరింత మెరుగ్గా పనిచేయాలని కోరారు. యూనియన్ కు కొత్తగా ఎన్నికైన జగదీష్ మాట్లాడుతూ యూనియన్ ని ముందుకు నడిపిస్తూ సమస్యలను అధికారుల ముందుకు తీసుకువెళ్లి సమ స్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

మంచి చేస్తున్న మన జగనన్న ప్రభుత్వాన్ని దీవించండి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మంచి చేస్తున్న మన జగనన్న ప్రభుత్వాన్ని దీవించండని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. 190వ రోజు ఎస్.కోట మండలం, వీరనారాయణం గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఈ మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు జగనన్న ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడగగా తమకు జగన్ ప్రభుత్వం వచ్చాక చాలా మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకి తెలపగా మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలంటూ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో అందిస్తున్న సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాలకు వేస్తున్నారని గుర్తుచేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి జగనన్న వచ్చాక తమ ఇంటి పెద్ద కొడుకుగా, పెద్ద అన్నగా ప్రజలకు మేలు చేస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గడిచిన మూడేళ్ల కాలంలో కరోనా వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న, వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇక గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 600 హామీలను తుంగలో తొక్కి మ్యానిఫెస్టోను వెబ్ సైట్లో నుండి తొలగించారని ఎద్దేవాచేశారు. అప్పటి టీడీపీ పాలనను, ఇప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని జగనన్నకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, పోతనాపల్లి కూనిరెడ్డి వెంకటరావు, వీరనారాయణం సర్పంచ్ ముమ్ములూరి సరోజిని, ఉప సర్పంచ్ పురుషోత్తం నాయుడు, ఎంపీటీసీ బోజంకి వెంకటలక్ష్మి, ముమ్ములూరి సోంబాబు, బోజంకి గోవింద, ముమ్ములూరి హర్ష, మండల సోషల్ మీడియా కన్వీనర్ మామిడి శంకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ రహదారులున్నా.. పలు గ్రామాలకు బస్సు సౌకర్యం నిల్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మండలంలో పలు గ్రామాలకు బీటీ రహదారులున్నప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవటంతో ఆటోలు, ట్రాక్టర్లు, సరకు రవాణా చేసే వ్యాన్లు, లగేజ్ ఆటోలు వంటి వాటిపై ప్రయాణం చేసే పరిస్థితి నేటికీ కొనసాగుతోంది. మండలంలో కొట్టాం గ్రామంలో కొలువుదీరిన కోటమ్మతల్లి ఆలయానికి ప్రతీ మంగళ, శుక్ర, ఆదివారాల్లో వందల సంఖ్యలో భక్తులు తరలివెళ్తుంటారు. అయినప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవటంతో లగేజ్ వ్యాన్లు, ఆటోలపై భక్తులు కిక్కిరిసి ప్రయాణం చేస్తుంటారు. అలాగే మండలంలోని వేములాపల్లి, రేవళ్లపాలెం, వీరనారాయణం, మూలబొడ్డవర, శివరామరాజుపేట తదితర గ్రామాలకు ఆటోలే దిక్కవుతోంది. ఇక కొట్టాం పంచాయతీ శివారు బందారువానిపాలెం, కృష్ణాపురం మీదుగా భీమవరం, ముషిడిపల్లి తదితర గ్రామాలకు ప్రస్తుతం ఉన్న రహదారులు గోతులమయం కావటంతో అక్కడి ప్రజలు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా బీటీ రహదారి సౌకర్యం బాగున్న గ్రామాలకు ఆర్టీసీ బస్సులను తిప్పాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-మాకవరపాలెం : విద్యార్థులకు ఇస్తున్న ఈ సుదీర్ఘ వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకొనుటకు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయశాఖ వారి ఆదీనంలో ఉన్న అన్ని గ్రంథాలయాలలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని మాకవరపాలెం గ్రంథాలయాధికారి చంద్రకళ తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ వేసవి శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనము, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులు ఈ వేసవి శిబిరాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

చెరువుల కబ్జాకు ఉపయోగించే యంత్రాలను సీజ్ చేయాలి

జెసిబిలు, ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేయాలి

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు

విశాలాంధ్ర-బెలగాం : చెరువుల కబ్జాకు ఉపయోగించే జెసిబి ట్రాక్టర్లు తదితర యంత్రాలను సీజ్ చేసి, ఆయా యంత్రాల యజమానులపై కేసులు నమోదు చేయాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు కోరారు. ఆదివారం ఆ సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి, పార్వతీపురం మండల అధ్యక్షులు బలగ శంకర్రావు, సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని లక్ష్మనాయుడు చెరువు, దేవుని బంధ, నెల్లిచెరువు లను కబ్జాదారులు దర్జాగా కబ్జా చేస్తున్నారన్నారు. రాత్రి,పగలు తేడా లేకుండా జెసిబిలు, ట్రాక్టర్లు తదితర యంత్రాలను పెట్టి చెరువులను ఆక్రమిస్తున్నారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడం శోచనీయమన్నారు. సమస్యలు పరిష్కరించని స్పందన కార్యక్రమం ఎందుకని వారు ప్రశ్నించారు. చెరువుల్లో కబ్జా జరుగుతోందని సోషల్ మీడియాతో పాటు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా కోడై కూస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్, సచివాలయ, మున్సిపాలిటీ అధికారుల్లో చలనం లేకపోవడం విడ్డూరం అన్నారు. చెరువులు కబ్జాలను ఊరంతా చూస్తున్నా అధికారులు సిబ్బంది చూడలేకపోవడం విచిత్రమన్నారు. జిల్లా ఏర్పడ్డాక కబ్జాలు అధికమయ్యాయని, అధికారులు సిబ్బంది తీసుకుంటున్న జీతానికి కూడా కనీసం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారులు రెచ్చిపోయి చెరువుల్లో పక్క భవనాలు నిర్మిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన అధికారులు అంధులుగా మారటం అన్యాయం అన్నారు. చెరువుల్లో పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చిన అధికారులను సిబ్బందిని తక్షణమే విధుల నుండి తొలగించాలన్నారు. పార్వతీపురం పట్టణంతో పాటు జిల్లాలో ఉన్న 15 మండలాల్లో ఆయా మండల కేంద్రాలు, ఆయా గ్రామాలలో ఉన్న చెరువులన్నీ దాదాపు కబ్జాకు గురవుతున్నాయన్నారు. కబ్జాలు నివారించడంలో జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, సచివాలయ, మున్సిపాలిటీ యంత్రాంగం విఫలమైందన్నారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ ధరలు పుంజుకోవడంతో అక్రమార్కులు ప్రభుత్వ చెరువులను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలను చేస్తున్నారన్నారు. కళ్ళముందే పట్టపగలు, చెరువులను కబ్జా చేస్తుంటే సంబంధిత ఆయా శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది చోద్యం చూస్తున్నారన్నారు. కోట్లాది రూపాయలు విలువైన ప్రభుత్వ చెరువులను కబ్జాదారులు ఆక్రమిస్తుంటే ఆయా శాఖలకు చెందిన అధికారులు వాటిని అడ్డుకునే పాపాన పోలేదన్నారు. చెరువులు కనుమరుగైతే భావితరాల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఈ విషయాన్ని గ్రహించి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చెరువులను పరిరక్షించాలన్నారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల్లో ఆక్రమణలు, అక్రమ కట్టడాలను తొలగించి, వాటికి పూనుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైతే కబ్జా సమయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారో వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే జిల్లాలోని చెరువులన్నింటికీ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి, ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొని, చెరువులను రక్షించాలన్నారు. సర్వేలో కబ్జాకు గురైనట్లు తెలిస్తే కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత ఉన్నతాధికారులు గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి అమలు చేయాలన్నారు. పబ్లిక్ గా కబ్జాలు జరుగుతున్న విషయాన్ని ప్రజలంతా చూసి, అధికారులను ఆడిపోసుకుంటున్నారని ఈ విషయాన్ని వారు గుర్తించాలన్నారు.

విద్యార్థులు ఒక లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి : కేసలి అప్పారావు

విశాలాంధ్ర-గుర్ల: విద్యార్థులు అందరూ ఒక లక్ష్యం ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా ప్రణాళికా బద్ధంగా చదువుకొని విజయం సాధించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. ఈ రోజు గుర్ల మండల కేంద్రములో నిర్వహించబడుతున్న బీ వీ ఆర్ కోచింగ్ సెంటర్ లో పదవ తరగతి ఉత్తీర్ణలైన విద్యార్థులును అభినందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ అనేది విద్యార్థి జీవితం యొక్క దశ దిశ నిర్దేశం చేస్తుంటాయని కావున ఇంటర్ బాగా చదువుకోవాలని సూచించారు.సోషల్ మీడియాకు,సెల్ ఫోన్లుకు ,చెడు స్నేహాలుకు,దురలవాట్లు కు దూరంగా ఉండాలని, విలువలు తో కూడుకున్న విద్యను అభ్యసించాలనీ, తల్లి దండ్రులు కన్న కలలును నెరవేర్చాలని,వారితో స్నేహ పూర్వకమైన వాతావరణంతో పెరగాలని తెలిపారు.ఈ ఆరు సం.కష్టపడి చదివినట్లు అయితే 60 సం. ఆనందమయ జీవితాన్ని పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బైరెడ్డి వెంకట రమణ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామం లో ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వేదమంత్రాలతో శంకుస్థాపనను చేశారు. గ్రామంలోని పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతీ ఒక్కరూ కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఈగ్రామంలో ప్రస్తుతం ఉన్నఆలయం స్థానంలో కొత్తగా నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకొండి

జిల్లా గ్రంధాలయ చైర్‌పర్సన్ రెడ్డి.పద్మావతి

విశాలాంధ్ర-సాలూరు రూరల్: గ్రంధాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి అన్నారు. ఆదివారం సాలూరు పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం గోడపత్రికను అవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకే వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.గ్రంధాలయంనకు రోజూ వచ్చి విద్యార్థులు బాల్యం నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులలో విషయ పరిజ్ఞానాన్ని పెంపెందించుకోవడానికి గ్రంధాలయాలు తోడ్పడతాయన్నారు. మే నెల 8 నుండి జూన్ 11 వరకు గ్రంధాలయాలలో ఆటలు,క్రాఫ్ట్,డ్రాయింగ్,స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తామని గ్రంధాలయ నిర్వహణ అధికారిణి టి.రాధాదేవి తెలిపారు.విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా గ్రంధాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపెందించుకునేందుకు వీలుగా తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంధాలయానికి పంపించాలని ఆమె కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసునమోదు



విశాలాంధ్ర-జామి: మండలంలోని గొడుకొమ్ము గ్రామానికి చెందిన ఓవివాహిత మహిళ అదృశ్యం కావడంతో జామి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనికి సంభందించి పోలీసులు అందించిన వివరాల మేరకు గొడుకొమ్ము గ్రామానికి చెందిన రావాడ తులసి(27) తన భర్త యోగితో తగాదా పడుతోంది. ఈనేపథ్యంలో జరిగిన తగాదా కారణంగా ఈనెల 5న ఆమె ఇంటినుంచి వెళ్ళి పోయింది. ఆమె కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ళ వద్ద వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో తులసి తండ్రి చిప్పాడ ఎర్నాయుడు ఆదివారం జామి పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈమేరకు కేసును ఎఎస్ఐ ఆర్‌వివి.నరసింగరావు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌ఛార్జి జిల్లావిద్యాశాఖాధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం: ఐటీడిఏ డిప్యూటీ డిఈఓగా, మన్యంజిల్లా ఇంచార్జి జిల్లా విద్యాశాఖాధికారిగా శుక్రవారం భాద్యతలు స్వీకరించిన ఎన్ ప్రేమ్ కుమార్ ఆదివారం ఎమ్మెల్యే జోగారావు ఇంటికివెళ్ళి మర్యాద పూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే జోగారావుకు ఆయన పుష్పగుచ్చం అందజేసారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని మన్యంజిల్లా పదోతరగతి పలితాల్లో ప్రథమ స్థానం రావడంపట్ల డిఈఓకు ఎమ్మెల్యే జోగారావు అభినందనలు తెలిపారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు నిరంతరం కృషిచేస్తానని డిఈఓతెలిపారు.

మిగిలిన వారి సస్పెన్షన్లు ఎత్తివేయాలని యుఎస్‌పిఎస్ డిమాండ్

విశాలాంధ్ర బెలగాం : ఉప జిల్లా విద్యాశాఖధికారి, గర్ల్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ ఎన్.డి.వి రమణ, రోజారమణిల సస్పెన్షన్లు ఎత్తివేయడం పట్ల పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యుఎస్ పిఎస్) హర్షం వ్యక్తం చేసింది. అలాగే ఒకే కారణంపై సస్పెండైన మిగిలిన వారి సస్పెన్షన్లు కూడా వెంటనే ఎత్తివేయాలని యుఎస్ పిఎస్ డిమాండ్ చేసింది. వీరఘట్టం రేగులపాడు కెజిబివి స్పెషల్ ఆఫీసర్ సస్పెన్షన్లను కూడా ఎత్తి వేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలక్టరుకు యుఎస్ పిఎస్ తరుపున మెమొరాండం ఇవ్వాలని, సస్పెన్షన్లు ఎత్తివేయకపోతే మరో పోరాటాన్ని ప్రారంబిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో యుఎస్ పిఎస్ నాయకులు పిసిహెచ్ శ్రీనివాసరావు, ఎస్. మురళీమోహన్ రావు, కె. విజయ్ కుమార్, ఎన్. బాలక్రిష్ణ, చంద్రశేఖర్, రెవిన్యూ అసోషియేషన్ నాయకులు గొట్టాపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

భోగితల్లి పండుగకు సర్వంసిద్ధం : కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలో సోమ,మంగళ, బుధవారాల్లో జరగనున్న భోగితల్లి గ్రామదేవత పండుగకు పెదబోగిలి, జోగమ్మపేట గ్రామపంచాయతీలోగల సీతానగరం,పెదబోగిలి,అప్పయ్యపేట, బుద్దిపేట , జోగమ్మపేటలో సర్వం సిద్ధమైందని కమిటీ సభ్యులు తెలిపారు. 12ఏళ్ల తరువాత చేయనున్న పండుగను దిగ్విజయంగా చేసేందుకు కమిటీ సభ్యులు గత రెండున్నర నెలలుగా అవిరామంగా శ్రమిస్తూ ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చర్చించి అమలు చేస్తున్నారు. వాహనాలు పార్కింగ్, సాంస్కృతికకార్యక్రమాల నిర్వహణకోసం స్థలాలు ఏర్పాటు చేశారు.ప్రధాన రోడ్డులో, సిరిమాను తిరిగే ప్రాంతాల్లో సర్వత్రా చర్యలు తీసుకున్నారు. మంగళ, బుధవారాల్లో ట్రాఫిక్ నియంత్రణ గూర్చి చేపట్టవలసిన చర్యలపై ఎస్ఐ నీలకంఠం కూడా కమిటీసభ్యులతో కలిసి మరోసారి చర్చించారు. సిరిమానురథం తిరిగే ప్రాంతాలనుకూడా ఆయన కమిటీ సభ్యులతో కలిసి క్షుణ్ణంగా మరోసారి పరిశీలించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. విద్యుత్ పై ఏఈ సోమేశ్వరరావు, సిబ్బంది విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.త్రాగు నీరుసరఫరా, రేవులుబాగుచేయడం, వీది లైట్లు ఏర్పాటు తదితర అంశాలను పంచాయతీ సర్పంచులు పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు.మొదటిరోజు సోమవారంనాడు తోలెళ్ళ ఉత్సవ కార్యక్రమంనాడు సీతానగరం, పెదబోగిలి, బుద్దిపేట, అప్పయ్యపేట, జోగమ్మపేటలో ఐదుప్రోగ్రాంలు ఉండగా, మంగళవారంనాడు సిరిమానురథం ఉత్సవసంభరంలో ఊరేగింపు సమయంలో రథంముందు కేరళ డ్రమ్స్, కోళాటం, తప్పిడగుళ్ళు,

డిజె తీన్మార్, చోడవరం డ్రమ్స్, శక్తి వేషాలు, రేలా రేలారే, పులివేషాలు, బాణా సంచా మందుగుండు సామాగ్రిని కాల్చడం తదితర కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారంరాత్రి 10గంటల నుండి వేకువఝాము వరకు ఈఐదు గ్రామాల్లోని ఢీషోలు, డాన్స్ బేబీ డాన్స్ షోలు, బుర్రకథలు దాదాపు పది చోట్ల నిర్వహించే చర్యలు తీసుకుంటున్నామని పండుగ

నిర్వహకులు చెప్పారు. ఆయా గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులతోపాటు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దలు, యువతఐక్యతగా ఉండి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ పండుగ విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం నాడు దేశతల్లికి సీతానగరం, అప్పయ్యపేట, జోగమ్మపేటలో మొక్కులు తీర్చుకున్నారు. పండుగకు ఐదు గ్రామాల్లో మూడు లక్షలమంది హాజరు కానుండగా దాదాపు మూడు కోట్లకోట్ల ఖర్చు అవుతుందన్నది స్పష్టంగా తెలుస్తోంది. ఐదుగ్రామాల్లో పండుగకోసం కమిటీ గత నెల రోజులుగా దాదాపు 40లక్షల రూపాయల వరకు ఖర్చు అయ్యిందని తెలిసింది. పండుగ సందర్భంగా పార్వతీపురం పట్టణ సిఐ కృష్ణారావు పర్యవేక్షణలో వంద మంది పోలీసులతో బందోబస్తుని ఏర్పాటు చేశారు. వాతావరణం అనుకూలంగా ఉండాలని ఐదు గ్రామాల్లోని ప్రజలు భోగితల్లిని అనుక్షణం వేడుకుంటున్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను పోటా పోటీగా ఏర్పాటు చేశారు.

డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రం వేపాడ శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక స్వీయపఠనము కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు శ్రీవల్లి, ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు అర్జున రావు, ఉపాధ్యాయులు శివప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ, చిత్రలేకనం, కథలు రాయడం తదితరపోటీలను నిర్వహించారు. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన 24 మంది విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - తెర్లాం: ఏపీ పౌర గ్రంథాలయ శాఖ వారి ఆధీనంలో ఉన్న అన్ని గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. జూన్ 11వ తేదీ వరకు ఈ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ఈ శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ తదిత సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులు ఈ శిబిరాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకోవాలని అన్నారు.

వేసవి శిక్షణా తరగతులపై విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి గ్రంథాలయం నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని విస్తృత ప్రచారం

నిర్వహిస్తున్నారు. జూన్ 11 వరకు మొత్తం 35 రోజులపాటు ఈ శిబిరాలు జరుగు తాయని కర పత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నట్టు గ్రంథాలయాధికారి దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పెద్దింటి రామారావు, పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోధ్యాయులు రవి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమానత్వం అంబేద్కర్ చలవే

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నేటి సమాజంలో అన్ని వర్గాల వారూ సమానత్వంతో ఉన్నారంటే అది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చలవేనని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతి మహోత్సవాల సందర్భంగా వైసీపీ నాయకులు జామాన శ్రీనివాసరావు, గండివల్లి సింహాచలం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ భవనంలో పేదలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్‌ను స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దళితులంటే వివక్ష ఉండేటి ఆ రోజుల్లో.. ఆయన చేసిన కృషి ఫలితమే నేడు ప్రతి ఒక్కరూ సమాన హక్కు పొందడంతో పాటు, ప్రపంచమంతా స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారని తెలిపారు. అంబేద్కర్‌ను నమ్ముకున్న ఏ ఒక్కరూ తప్పులు చేయరని, త్రికరణ శుద్ధితో ఉంటారని చెప్పారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతి దేవితో కలిసి సుమారు 150 మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, బుంగ భానుమూర్తి, గార సత్యనారాయణ, సుజాత, మహేంద్ర బాబు పాల్గొన్నారు.

కృష్ణాపురం గ్రామానికి హద్దురాళ్లు తరలింపు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: కృష్ణాపురం గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తయినందున హద్దురాళ్లు తరలింపు చేపట్టామని తహశీల్దార్ డి.శ్రీనివాసరావు వెల్లడించారు. సర్వే జరిగిన మండలంలోని కురిడి, కృష్ణమహంతి పురం, శివరామరాజుపేట గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు పూర్తయిందన్నారు. త్వరలోనే కృష్ణాపురంలో హద్దురాళ్లు వేయించి మిగిలిన గ్రామాల్లో సర్వే ప్రక్రియ చేపడతామని తహశీల్దార్ శ్రీనివాసరావు వివరించారు. తహశీల్దార్ వెంట భూముల రీ సర్వే డీటీ కీర్తన, అసిస్టెంట్ సర్వేయర్ ప్రభాకర్, సర్పంచ్ యామినీదేవి తదితరులు ఉన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటుకు భూమిపూజ



విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో పెద్దగైశాల గ్రామంలో చాలా సంవత్సరాల నుండి త్రాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎంతమంది రాజకీయ నాయకులు మారిన ఈ త్రాగునీటి సదుపాయాన్ని దాహం దాహం అన్న పట్టించుకునే నాధుడే లేడు. పెద్ద గైసాలలో త్రాగునీటి సదుపాయం లేకపోవడం వలన అనారోగ్యాలకు గురవుతున్నారు. విషయం తెలుసుకొన్న జనసేన పార్టీ తరఫున మండల అధ్యక్షులు లీడర్ గేదెల రిషి వర్ధన్ జన సైనికులు గ్రామస్తులతో ఆదివారం సొంత నిధులతో బోరింగ్ తీయడానికి పెద్ద గైసాల గ్రామంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం మహిళలు గ్రామస్తులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికిచ్చినా గెలుపునకు కృషి చేస్తాం

ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో పార్టీ తరపున ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికిచ్చినా కష్టపడి ఆ అభ్యర్థి గెలుపునకు పని చేస్తామని ఎస్.కోట ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ జి.సంతోషికుమారి స్పష్టం చేశారు. ఎస్.కోట పట్టణంలోని ఎమ్మెల్సీ రఘురాజు స్వగృహంలో ఎస్.కోట ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఇటీవల పలు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఎమ్మెల్సీ రఘురాజుని భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపనకు విచ్చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి జగనన్న ఏదో అన్నట్లు వచ్చిన కథనాలను వారు ఖండించారు. కనీసం ఎటువంటి వివరణ తీసుకోకపోవడం, ముఖ్యమంత్రి అంటుంటే మా పక్కన ఉండి మాటలు విన్నట్లు కొన్ని పత్రికలలో కథనాలు ప్రచురించటాన్ని తప్పుబట్టారు. ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు శంఖుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగనన్న పార్టీ కార్యక్రమాల్లో అందరినీ కలుపుకుని వెళ్లాలని ఎమ్మెల్యే కడుబండికి సూచించారన్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యే ఎస్.కోట మండలం, వీరనారాయణం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎంపీపీ అయిన తనను కనీసం ఆహ్వానించక పోవటం ముఖ్యమంత్రి ఆదేశాలను ధిక్కరించటం కిందకు వస్తుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే మా మధ్య చిన్న చిన్న పొరపొచ్చాలు తప్పించి ఎటువంటి వివాదాలు లేవని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టు శంఖుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగనన్న మా అందరితో నవ్వుతూ మాట్లాడారని, పార్టీ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ రఘురాజుని కాకుండా ఇంటింటికి ఎస్.కోట వైస్ ఎంపీపీ సుధమ్మను తీసుకెళ్లాలని సీఎం సూచించారని, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని వైస్ ఎంపీపీ సుధమ్మతో సీఎం అన్నారని గుర్తు చేశారు. అయినప్పటికీ వీరనారాయణంలో ఎమ్మెల్యే నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీని ఆహ్వానించక పోవడం విస్మయం కలిగించిందన్నారు. ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి మాట్లాడుతూ ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు శంఖుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగనన్నను నేరుగా కలిసే భాగ్యాన్ని ఎమ్మెల్సీ రఘురాజు కల్పించారన్నారు. కనీసం ముఖ్యమంత్రి జగనన్న జిల్లాకు వస్తున్న కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

వేపాడలో టీడీపీ ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రం వేపాడలో మండల టీడీపీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ సమక్షంలో వేపాడ గ్రామ టీడీపీ నాయకులు నిరుజోగి దాలినాయుడు మాస్టర్, రంభ శంకరరావు మాస్టరు, మాజీ సర్పంచ్ భర్త నిరుజోగి ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు నిరుజోగి బంగారు నాయుడు, వల్లంపూడి టీడీపీ సీనియర్ నాయకుడు గోకేడ సత్యం తదితరుల సారథ్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కోళ్ల రాంప్రసాద్ మాట్లాడుతూ పార్టీకి కంచుకోట అయిన వేపాడ మండలంలో పార్టీ పునర్జీవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వేపాడ గ్రామానికి సంబంధించి పార్టీ సీనియర్ నాయకులు నిరుజోగి దాలినాయుడు, ముత్యాల నాయుడు, రంభ శంకరరావు తదితరులు గత కొన్నేళ్లుగా స్థానిక నాయకుల ఏకపక్ష వైఖరి కారణంగా నిరాశ నిస్పృహలతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని ఇకపై పార్టీ బలోపేతానికి పున రంకితం కావడానికి ముందుకు రావడం హర్షించదగ్గ విషయమ న్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ మాట్లా డుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎంపీపీ ఎన్ని కల్లో పార్టీ నుంచి గెలిచిన నలుగురు నాయకులు టీడీపీని వీడి బయ టకు పోయారన్నారు. గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి కలిసివచ్చే నాయకులు కార్యకర్తలను తిరిగి పార్టీలోకి ఆహ్వాని ద్దామ న్నారు. మండల పార్టీ కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి మాట్లాడుతూ టీడీపీ అంటే కోళ్ల కుటుంబమని అటువంటి ముద్రగల ఈ కుటు ంబానికి మనమంతా అండగా నిలబడాలని కోరారు. కార్యక్ర మంలో పార్టీ సీనియర్ నాయకుడు దాలినాయుడు, రంభ శంక ర రావు, సీనియర్ నేత నిరుజోగి బంగారు నాయుడు, వల్లంపూడి టీడీపీ సీని యర్ నేత గోకేడ సత్యం, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల చర్చలపై హర్షం

విశాలాంధ్ర - బెలగాం: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు అమలు చేసేందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపడం ఎంతో హర్షనీయమని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు విద్యాశాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేస్తున్నామని తెలిపారు. విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో పాల్గొని, పార్వతీపురం చేరుకున్న సామల విలేకరులతో మాట్లాడారు. విద్యామంత్రితో జరిగిన సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగిందని, పాఠశాలల్లో అమలు చేస్తున్న వివిధ యాప్స్ భారంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా, ఐటీ సెల్ రాష్ట్ర బాధ్యులు భాస్కర్‌ని సమావేశానికి పిలిపించి దాదాపు 80 శాతం యాప్‌ల పని భారాన్ని తగ్గించారని, ఇది ఉపాధ్యాయులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. అదేవిధంగా ఎంఈఓ పోస్టులు, గ్రేడ్2 హెచ్‌ఎం పదోన్నతులకు ఎటువంటి కోర్టు సమస్యలు లేనందువలన వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి సమావేశంలో ప్రకటించడాన్ని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం స్వాగతిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో కావలసిన అంశాలను రాతపూర్వకంగా 10వ తేదీ నాటికి విద్యాశాఖ జెడి సర్వీసెస్‌కు అందజేయాలని మంత్రి సూచించారని తెలిపారు.

టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలతో ఒరిగిందేమీ లేదు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గత టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల వల్ల రాష్ట్రానికి ఒరిగేదీ ఏమీ లేదని ఆంధ్రప్రదేశ్ భాజపా స్వచ్ఛ్ భారత్ కో కన్వీనర్ కుసుమంచి సుబ్బారావు అన్నారు. ఆదివారం కోట వద్ద జరిగిన భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కుసుమంచి మాట్లాడుతూ ప్రధాన మంత్రి తీసుకుంటున్న నిర్ణయాలకు యావత్ ప్రపంచానికే దిక్సూచిగా ఉంటే ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం గత టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు స్వచ్ఛ్ భారత్ ద్వారా అందరికి మరుగుదొడ్లు, ఇల్లు, జలజీవన్ మిషన్‌తో అందరికి నీళ్ల వంటి పథకాలు అమలు చేయకుండా కేవలం అధికార దాహంతో ఈ రెండు ప్రభుత్వాలు రాష్ట్రాభివృద్ధికి తూట్లుపొడిచారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి సరైన రాజధాని నిర్మాణం , సాగు నీరు, త్రాగునీరు అందించే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వాపోయారు. నష్టపోయిన రైతులకు ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం ద్వారా ఇవ్వవలసిన రుసుమును కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేరవేయక పోవడం శోచనీయమని అన్నారు. పట్టణ 19వ డివిజన్ లంకాపట్నంలో సుమారు 200 మంది కుటుంబాలకు గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనందున విజయనగర భాజపా శ్రేణి ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా విజయనగర నార్త్ మండల అధ్యక్షులు ఇమంది సుధీర్, సౌత్ మండల అధ్యక్షులు ఇప్పిలి గోపాలకృష్ణ, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్దుల్ ఆదిల్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గ్రంధి కృష్ణమూర్తి, ఎస్సీ మోర్చా కన్వీనర్ సోము మహేష్, నార్త్ జోన్ ప్రధాన కార్యదర్శి రిక్కా పైడిరాజు, హుస్సేన్, ప్రకాష్ రావు తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

104 ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బెలగాం: స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం దర్రు ఆనందరావు అధ్యక్షతన 104 ఎంఎంయూ ఉద్యోగస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ 104 ఎంఎంయూ ఉద్యోగస్తులకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని గతంలో వలే రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా 104 ఎంఎంయు ఉద్యోగస్తులను నిర్వహించి ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని జీవో నెంబర్ 44, 59 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని ఎంప్లాయిస్ కాంట్రిబ్యూషన్‌ను అరవింద్ యాజమాన్యమే చెల్లించాలని , డీఎస్సీ ఆర్‌టిఆర్ ద్వారా నియమించబడిన సీనియర్ డ్రైవర్లకు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 0-5, 5-10, 10 సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారికి స్లాబ్ సిస్టం ఆటోమేటిక్‌గా అప్డేట్ చేయాలని అన్నారు. ప్రతి నెలా జీతాలు చెల్లించి బకాయి వేతనాలు చెల్లించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగస్తులకు స్థానిక ప్రదేశాలకు బదిలీ చేయాలని, వాహనాలు సకాలంలో క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి వాహనాలకు ఫిట్నెస్, ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయుడు, రమణ 104 ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

పది ఫలితాలలో శ్రీ చైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం సాయి నగర్ లో శ్రీ చైతన్య విద్యానికేతన్ స్కూల్లో చదివిన విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. 600 మార్కులకు గాను 576 మార్కులు యు ప్రీయతం కుమార్ సాధించారు. 23 మంది విద్యార్థులు పదో తరగతి

పరీక్షలకు హాజరుకాగా శత శాతం ఉత్తీర్ణత సాధించారు. 400 మార్కులు పైబడిన విద్యార్థులు 18 మంది ఉన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఎస్ గౌరీ శంకర్రావు, స్కూల్ ప్రిన్సిపల్ పద్మ, స్కూల్ వ్యవస్థాపకులు కొల్లి రామారావు డి నారాయణ లు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషిచేసిన ఉపాధ్యాయ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ గౌరీ శంకర్రావు మాట్లాడుతూ తమ స్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ వివిధ పోటీ పరీక్షలు అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

పదో తరగతి ఫలితాలలో శ్వేత చలపతి సంస్థానం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - బొబ్బిలి : శనివారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్వేతా చలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచారు. పల్లి షర్మిల 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించారు.580 మార్కులు నలుగురు విద్యార్థులు సాధించగా, 570 మార్కులు ఏడుగురు విద్యార్థులు సాధించారు. 560 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించారు. 550 మార్కులు 21 మంది విద్యార్థులు సాధించగా, 500 మార్కులు 40 విద్యార్థులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శ్వేతా చలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం స్కూల్ చైర్మన్ ఆర్వీఎస్ కేకే రంగారావు (బేబీ నాయన) స్కూల్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్ లు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధనకే కృషిచేసిన ఉపాధ్యాయ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్వేత చలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్ మాట్లాడుతూ శ్వేతా చలపతి సంస్థాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు.

జిల్లా ఎపిఎంసిఎ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఒ) యూనియన్ ఏర్పాటు

విశాలాంధ్ర - బెలగాం : ఎపిపిహెచ్ సిడిఎ ప్రెసిడెంట్ డాక్టర్ రఘు కూమార్, ఎపి ఎన్జీఓ అధ్యక్షులు శ్రీ కిషోర్, ఎపిపిహెచ్ సిడిఎ జనరల్ సెక్రెటరీ డా. మంతిని వినోద్ కుమార్ అధ్యక్షతన ఎపిఎంసిఎ పార్వతీపురం ప్యానల్ మెంబర్స్ ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షునిగా సిహెచ్ జగదీష్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సరిత, కోశాధికారిగా రాజేశ్వరి, జాకబ్ ఇతరులను ప్యానెల్ మెంబర్స్ గా ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా జిల్లా ఎపిపిహెచ్ సిడిఎ ప్రెసిడెంట్ డా. రఘు మాట్లాడుతూ సిహెచ్ఓ అసోసియేషన్ అభివృద్ధి కొరకు తన సహకారం అన్ని విధాలుగా అందిస్తామని అన్నారు. ఎపి ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షులు జీవిఆర్ఎస్ కిశోర్ మాట్లాడుతూ ఇది చాలా శుభ పరిణామని ముఖ్యంగా జిల్లాలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డా వినోద్ కుమార్ మాట్లాడుతూ సిహెచ్ఒలు పని చేస్తున్న తీరు బాగుందని మరింత మెరుగ్గా ఉండాలని కోరుతున్నామన్నారు. జగదీష్ మాట్లాడుతూ యూనియన్ ని ముందుకు నడిపిస్తూ సమస్యలను అధికారుల ముందుకు తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అరసాడ సమీపంలో ఆటో బోల్తా: ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర - వంగర: మండలంలో అరసాడ గ్రామ సమీపంలో గల వంగర, రాజాం ప్రధాన రోడ్డులో ఆటో అదుపు తప్పి బోల్తా పడి ఇరువురికి గాయాలయ్యాయని 108 సిబ్బంది రాజారావు, పవన్ తెలిపారు. వంగర నుంచి రాజాం వైపు వెళ్తున్న ఆటోలో తండ్రీ కూతుళ్ళు వెళ్తున్న ఈ ఆటో అదుపుతప్పి బోల్తా పడటం వల్ల కందిశ ప్రసాదరావు, కుమార్తె కందిశ మాధురి గాయాల పాలయ్యారు. ఇందులో వున్నటువంటి మాధురీలతకు బలమైన గాయాలు కాగా, ప్రసాదరావుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం రాజాం ఏరియా హాస్పటల్‌కి తరలించినట్లు ఇ ఎం టీ రాజారావు, పైలట్ పవన్ కుమార్ తెలిపారు.

జిల్లా రజక సంఘం నూతన ఎంపిక

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా రజక సంఘ కార్యవర్గ ఎంపిక ఆదివారం దాసన్నపేట రింగ్ రోడ్డు రోడ్డు వద్ద ఉన్న రజక సంఘ కార్యాలయంలో జరిగింది ఈ కార్యక్రమానికి చైర్మన్గా విజయనగరం పార్వతీపురం జిల్లాల చైర్మన్, ఏ.విజయలక్ష్మి వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎం చిట్టితల్లి, జిల్లా అధ్యక్షులుగా టీ భాస్కరరావు కార్యదర్శిగా జంపా చిన్న, కోశాధికారిగా ఎం రాజారావు, ముఖ్య సలహాదారులుగా రాయవలస గోవింద, పొలిమేర చల్లారావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో జిల్లాలో ఉన్న రజకుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని నూతన కమిటీ తెలియజేశారు.

ధరలు పెంచి పేద ప్రజల

పొట్టకొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : నిత్యావసర వస్తువుల ధరలను ఇష్టానుసారంగా పెంచేసి రాష్ట్ర ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజల పొట్టకొడుతోందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ విమర్శించారు. శృంగవరపుకోట మండలం, వసి గ్రామంలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం యువనేత గొంప క్రిష్ణ, గ్రామ మాజీ సర్పంచులు కోరుకొండ శ్రీనివాసరావు, జనపరెడ్డి తాతబాబుల అద్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత గొంప క్రిష్ణకు గ్రామ ప్రజలు సాదర స్వాగతం పలికి మంగళహారతులు పట్టారు. గొంప మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2,60,000 ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న విషయం ఏమైందని ప్రశ్నించారు. ఈ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఎటువంటి ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువత అందరిని మోసం చేశాడన్నారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు అండగా ఉండాలని మన అందరి నాయకుడు నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇచ్చేవారని గుర్తు చేశారు. అలాంటిది ఈ జగన్ రెడ్డి రాగానే నిరుద్యోగ భృతిని తీసేసి నిరుద్యోగలందరినీ మోసం చేసాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), జుత్తాడ రామసత్య(మండల పార్టీ సెక్రటరీ), కోరుకొండ శ్రీనివాసరావు (వసి సర్పంచ్), జానపరెడ్డి తాతబాబు (వసి మాజీ సర్పంచ్), మాదిబోయిన మంగరాజు (ఎస్ కోట ఎక్స్ వార్డ్ మెంబర్), ఆదారి ఉమామహేశ్వరావు (గోపాలపల్లి సర్పంచ్), గనివాడ సన్యాసినాయుడు (వినాయకపల్లి సర్పంచ్), లగుడు ఎర్నినాయుడు, మండా త్రినాథ్ (మామిడిపల్లి పార్టీ ప్రెసిడెంట్), కేవీ సత్యనారాయణ (ధర్మవరం యూత్ ప్రెసిడెంట్), ఎర్రినాయుడు దండుపాటి, గొరపల్లి ఈశ్వర్ రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.